UNIVERSAL LIBRARY
OU_204913
UNIVERSAL LIBRARY

# "కర్మఫలం"

*

రచయిత

చల్లా అప్పారావు

పెద్దాపురం

1943

*

All rights Reserved.

తొలిముద్రణం
౧౯౪౩

వెల రు. 0–12–0

శ్రీ ప[illegible] ముద్రణాలయము
కాకినాడ

# తొలి పలుకు

పెద్దాపురంలో దివ్యజ్ఞాన సమాజంవారు 'కర్మఫలం' అను చిన్న నాటకాన్ని వేయించేరు. ఒక పాత్రధారునిచే "కొందరు భగవంతుడు లేడని అంటున్నారు" అని అనిపించేరు. ఆమాట నిజము. "సత్యం వదా ధర్మం చరా" అని వేద వాక్య. వేదాన్ని నే నొకందుకు గౌరవిస్తాను. వేదం ఒకప్పుడు హిందూ నాగరికతకు గల ఔన్నత్యాన్ని తెలుపుతుంది. ఈరోజున కూడా మహాత్ముడని పిలవబడుతున్న గాంధీగారు "నిజమే భగవంతుడు" అంటున్నారు. కర్మఫలం నాకు సంకోచన గలుగజేసింది. ఆ సంకోచంవల్లనే నేను ఆలోచన మొదలుపెట్టేను. ఏమిటా ఆలోచన? కొందరు చెప్పే మాటా లేక అందరూ (నటకులు) చెప్పే మాటా నిజమైందని. మూడు సంవత్సరాల క్రిందటే యీచిన్న గ్రంథాన్ని వ్రాయడం మొదలుపెట్టేను. కాని కొన్ని కారణాలవల్ల వెంటనే ముగించలేకపోయేను. చాల ఆలస్యమయింది. ఆనాటకం వేయించి యీపుస్తకం వ్రాయాలన్న కోరిక నాలో కలిగించిన దివ్యజ్ఞాన సమాజంవారికి కృతజ్ఞుణ్ణి.

ఈగ్రంథం భగవంతు డున్నాడా లేడా యన్నప్రశ్నకు సమాధాన మివ్వదు. ఈప్రశ్న నన్ను చాలా బాధిస్తుంది. ఇది నాప్రస్తుత పరిమితజ్ఞానాని కతీతం.

వినికిడివల్ల నయితేనేం, చదవడంవల్ల నయితేనేం, ఉప నిషత్తులు, గీత మొదలైన గ్రంథాల్లో గల గొప్పతనాన్ని గమనించేను. నేను వాట్లను గౌరవిస్తాను. కాని దుష్టులు దేవునిపేరిట దుష్కార్యాలు, దురంతాలు చేస్తున్నారు. దుర్నీతిని బోధిస్తున్నారు. 'నీతి' అనుమాటయొక్క అర్థం నిత్యమూ ఒకటికాకపోయినా మానవకోటికి ఎల్లకాలాలందు మంచి కలుగజేసే దై యుండాలని కోరేవాళ్ళలో నే నొకడ్ని. నిజాన్ని తెలుసుకోడానికి ప్రయత్నించేను, ప్రయత్నిస్తున్నాను. ఎవరయితే భగవంతుడున్నాడని వృత్తిగా అవలంబించేరో వారుచేసే కార్యాలవల్ల, (వాట్లను నేను దుష్కార్యాలంటాను) భగవంతుడున్నాడా లేడా? అనుసందేహాన్ని కలిగించేరు. కొందరిచేత భగవంతుడు లేడని అనిపిస్తున్నారు. వారుచేసే పనులే వారుచెప్పే మాటల్ని ఖండిస్తున్నాయి.

గీత ప్రతిమానవుడు స్వశక్తివల్ల పరబ్రహ్మస్వరూపాన్ని తెలుసుకోగలుగుతాడని, అందులో ఐక్యమవడాన్ని కూడా అవకాశముందనీ. అలా మానవుడు చెయ్యడానికి భగవంతుడనుకూలుడని ఘోషిస్తుంది. కాని ఇహలోకంలో స్వశక్తిని వినియోగించి సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు చెమటూర్చి పనిచేసిన మానవునికి తిండి లేకుండా పోయింది. ఈ దుస్థితికి కారణం కర్మఫలం అయితే ప్రతి మానవుడు మోక్షంకోసం పాటుపడ్డాని కవకాశ మెక్కడుంది? తనశక్తి

వల్ల మానవుడు మోక్షం పొందగలిగిననాడు, అష్టకష్టాలుపడ్డ మానవునకు ఇహలోకంలో సుఖం లేకుండా యెందుకుపోనాలి ?

ఈ భౌతికప్రపంచంలో మానవుడు చేసేకృషే కాదూ మోక్ష మిచ్చేది ? ప్రపంచాన్ని సృజించిన భగవంతుడు Power of Attorney సనాతనునకిచ్చి నిదురపోతున్నాడా ? మానవకోటిలో తనకు కలబాధ్యతను భగవంతుడు విడిచిపెట్టుకొన్నాడా ? అల్లాఅయితే యీబాధ్యతను వహించేది సనాతనుడా సమాజమా ? సనాతను డైననాడు భగవంతునితో మనకు పనిలేదు. కానినాడు సంఘసంస్కరణ చేసి సమాజంలో సామ్యవాదాన్ని నెలకొల్పడానికి సాహసించాలి మానవుడు. అందుకోసం సర్వశక్తిని వినియోగించాలి.

పెద్దాపురం,<br>
9-9-1943.

చల్లా అప్పారావు.

# కర్మఫలం ★

ఒక పల్లె. చామర్లకోటకు రెండుమైళ్ల దూరంలో దక్షిణాన్ని ఉంది. ఇక్కడ ప్రజలయొక్క వృత్తి ఎక్కువగా వ్యవసాయం. ఈ గ్రామానికి దక్షిణంగా మదరాసునుండి కలకత్తాకు పోయే ఇనుపమార్గ ముంది. తూర్పువైపుగా రాజమండ్రీ నుంచి జిల్లా కేంద్రం కాకినాడకు వెళ్లే రోడ్డు వుంది. దాని ప్రక్కనే బంగాళాఖాతంలో కలిసేవరకూ గోదావరి కాలువ ప్రవహిస్తోంది. రైతులు తమపొలాల్లోకి పోవాలంటే దోనె మీద కాలువ దాటి అవతలిప్రక్కగా వెళ్లాలి. కాలువదాటే రేవుదగ్గర వో ధాన్యపు మర ఉంది. దాని ఎదురుగా ఒక మఱ్ఱిచెట్టుంది. పొలాల్లోకి వెళ్లేముందు కూలీలు రైతులు ఆ చెట్టుక్రిందే కలుసుకుంటారు.

ఈ గ్రామానికి అగ్రగణ్యుడు యగ్గన్న అనే బ్రాహ్మణుడు. ఇతడు సనాతనధర్మానికి పునికిపట్టు. సంపాదనాపరుడు.

ఇతని పొడవు సుమారు రెండడుగులు. స్థూలకాయుడు. శరీరచ్ఛాయ నల్లనిది. నెత్తిమీద గోష్పాదమంత జుట్టు ఉంటుంది. గడ్డం. వయస్సు పదమూడుదినాలు. కనుబొమ్మలు సందేహాస్పదాలు. నూటికి సగం తెల్లవెంద్రుకలు. మేఘంలో మెఱుపుతీగవలె కుడిభుజంనుండి ఎడమచేతి క్రిందవరకూ

జంధ్యం. మోకాళ్ల వరకూ బిళ్లపంచికట్టు. నడుముకి ఒక కాశ్మీరశాలువ. నెత్తిమీద ఒక అంగవస్త్రం. చెవుల కుండలాలు, చేతుల సింహతలాటాలూ చూస్తే, యీయన పాండిత్యానికి ఏసభలోనైనా బహూకరించారా అనిపిస్తుంది. కాని ఈయన స్వయంగానే చేయించి పెట్టుకొన్నాడు, ఈ యాభరణాలు. ఫాలంమీద శరీరంమీద విభూతిపిండికట్లు పెట్టాడు. ఫాలమధ్యాన్ని చిన్న చుక్కబొట్టు వుంచాడు. వీటినిచూస్తే హిమాలయ ప్రత్యంతపర్వతాల సముదాయాన్ని, కైలాసగిరి శిఖరాన్ని జ్ఞప్తివారిస్తాయ్. సందేహమెందుకు ? ఇతడు శంకరుని పూజిస్తాడు. ఆయన కైలాసవాసి యని హిందువుల నమ్మక.

ఇతని తండ్రి రామశాస్త్రికి, ఈ యగ్గన్న సుబ్బమ్మా యిద్దరూ సంతానం.

సుబ్బమ్మను ఆవూరిలోనే ఒక ధనిక బ్రాహ్మణునికిచ్చి పెండ్లిచేశాడు. అతనిపేరు జోగయ్య. అతనికి సుబ్బమ్మ వల్ల వకకుమారుడు కలిగేడు. పిల్లవానిపేరు శర్మ.

యగ్గన్న కురూపి ఏకాక్షు డవడంవల్ల ఆలస్యంగా వివాహమైంది. భార్యపేరు సుందరమ్మ. చాల బీదకుటుంబం లోంచి వచ్చింది. ఈమెవల్ల యగ్గన్నకు రామశాస్త్రి భాగ్యలక్ష్మి అనే యిద్దరు సంతానం కలిగేరు. ఇంతలో సుఖవ్యా

ధులవల్ల బాధపడి మరణించేడు యజ్ఞన్నతండ్రి. తండ్రి చనిపోయిన కొద్దిరోజులకే పాపం సుబ్బమ్మ గంగాభాగీరథీ సమానురాలైంది.

శర్మ పెద్దవా డయ్యేడు. చామర్లకోటలో విద్య ముగించి కాశీ విశ్వవిద్యాలయంలో చదువు ప్రారంభించేడు. మరుసటి సంవత్సరం రామశాస్త్రి కూడా విద్య నభ్యసించ డానికి కాశీ వెళ్లేడు. ఇతన్ని న్యాయవాదిగా చేద్దామని తండ్రి కోరిక.

శర్మ చాల తెలివైనవాడు. స్వతంత్రబుద్ధి కలవాడు. ఆలోచనాధురీణుడు. కాశీ వెళ్లిన కొద్దిరోజుల్లోనే సామ్యవా దులతో సంపర్కం కలుగజేసుకొని 'కారల్ మార్క్స్, లెనిన్' మొదలైన మహనీయులు వ్రాసిన గ్రంథాలు చదివాడు. తాను చదివి సంగ్రహించిన విషయాలు తన్ను పలుకుబడి చేసేయి. ఇతనిలో మార్పు కలిగింది. స్వేచ్ఛావిహారం పోయింది. సెల వల్లో ఇంటికి వచ్చినప్పుడెల్ల బీదల గృహాలకు పోయి వారి కష్టాలుచూసి వారితో మెలగి ప్రపంచవిషయాల్ని బోధించే వాడు. స్థానిక సామ్యవాదులతో కూడా సంపర్కం కలగజేసు కొన్నాడు. ఇతనిగృహం సామ్యవాదుల కాటపట్టయింది. బీద ప్రజలకు ఇతనియందు విశ్వాసం భక్తీ కలిగింది. వారు ఏం

చెప్పినా, ఆ అమాయకపు ప్రజలు చేస్తారని తనకి నమ్మకం కలిగింది. కాని వాళ్లను ఇతడు తప్పుద్రోవను పెడతాడా ? ఇతడు వయస్సుకు చిన్నవాడైనా గొప్ప మేధావి. విజ్ఞాని.

ఇప్పటికే ఇతనిపట్ల యగ్గన్నకు అయిష్టం ప్రబలింది. తండ్రికి జడిసి రామశాస్త్రుల్లు రహస్యంగా గాని శర్మని కలుసుకోవడం మానుకొన్నాడు. కాని ఆగ్రామంలో ఉన్న విద్యావంతుల్లో శర్మకు స్నేహితులు లేకపోలేదు. శర్మ స్నేహితుడు యింకో బ్రాహ్మణ కుటుంబానికి చెందిన శ్రీమన్నారాయణుడు. మదరాసులో చదువుతూ తన ఇంటికి చేరుకున్నాడు సెలవల్లో. వీరిరువురూ పెద్దాపురంలో వున్న సామ్యవాదిమిత్రులతో కలసి ఒక భౌతికతత్వవేత్త వ్రాసిన చిన్న నాటకాన్ని తమ గ్రామంలో జూలై పదమూడవ తేదీని ప్రదర్శించడానికి నిశ్చయించారు. ఆ తేదీ వచ్చింది. ఈ విషయం ప్రజలకు తెలిసింది. గ్రామమంతా నటకులవుద్దేశాల్ని తెలుసుకొని ప్రజలు గుంపులు గుంపులుగా చేరి ఆశ్చర్యంతో చెప్పుకొన మొదలుపెట్టేరు.

సాయంకాలమైంది. తోడాపతోడీలుగా ప్రజలు వచ్చారు ప్రదర్శనశాలదగ్గరకి. గ్రామాంతరానికేగి చీకటిపడే సమయానికి ఇంటికిచేరుకొన్న యగ్గన్నకు తెలిసింది యీసమా

చారం. రౌద్రు డయ్యాడు. జంధ్యం మూడుపర్యాయాలు త్రిప్పాడు. ఈ నల్లమందు వ్యాపారస్థుడు సోవన్నకాపుదగ్గ రకు వెళ్లి నల్లమందు ఇంజక్షను ఇచ్చేడు. సోవన్న మొదలైన పెద్దకాపులకు యెక్కింది మత్తు. అత డేమిచెబితే చేయరు ? అతడు చెప్పేది వేదం అని వాళ్లకు పూర్వమే నమ్మకం కలి గింది. కాని స్వతంత్రబుద్ధికల శర్మ ఎవరిమాట వింటాడు? ఆటంకపరచాలని యగ్గన్నమాత్రం పట్టుదలవహించాడు.

★

# నాటకం

★

## యముని న్యాయస్థానం.

చిత్రగుప్తుడు గోపిశెట్టి కింకరులు మొదలైనవారుంటారు.

[ప్రవేశం : యముడు]

చిత్రగుప్త—ఓ యమధర్మరాజా! ఈ ప్రాణి మానవలోకం లో గోపిశెట్టి యని పిలువబడ్డాడు. ఇతని జీవితమంతా ఇతరుల్ని పీడించి ధనమార్జించడంలో గడుపబడింది. ఇతడు లోభత్వంవల్ల తనబోటి మరియొక లోభిని చంపించాడు. కొంతమంది మానవులకు నివసించుటకు గృహాలు లేకుండ జేశాడు. ఈ విధంగా వీరైనంత వరకూ తన సాటి మానవులకు కష్టాలు కలిగించాడు. కావున శ్రీ కోర్టువారికి తెలియపరచడమైంది.

గోపిశెట్టి—ఏమయ్యా! నామీద అన్ని చాడీలుచెబుతావ్. నేను ఎంతమంది కోర్టు గుమస్తాలకు లంచమివ్వలేదు? కావలిస్తే పదిరాళ్లు అడిగి తినగూడదూ, నీవుకూడా.

యముడు—గోపిశెట్టీ! నీవింకులకేం చెప్తావ్?

గోపి—చిత్తం! తమసెలవైతే న్యాయవాదిద్వారా తెలుపుకుంటా.

యమ:—(గభీరంగా) ఇచ్చట నీకు న్యాయవాదు లుండరు. నీయంతట నీవే చెప్పుకోవాలి. నీవు చేసింది కాదన

డానికి వీలులేదు; చేసిన అపరాధాలికి కారణం తెల్పు కోవాలి.

గోపి—ప్రభూ! నేనింతమందిని పీడించకపోతే, ఇంతడబ్బు సంపాదించడం దుర్లభం. అంచేతనే, గుళ్ళు, గోపురాలు కట్టగలిగేను; బ్రాహ్మణుల్ని పోషించగల్గేను. వెంకట శెట్టిని చంపించిన తరవాత పురాణాలను చదివి, మా సర్వన్న శాస్త్రులుగారు చెప్పినట్లు పాపపరిహారార్థము సత్రాలు కట్టించాను. ధర్మాధర్మ విచక్షణ వుంటే, ధన మార్జించడం దుర్లభం, బాబూ!

యము—నీవు చేసిన పాపాలు దేవళాలు కట్టించిన పోతా యని తెలియక కట్టించి సర్వాంతర్యామియగు భగవం తుణ్ణి అవమాన పరచావ్. ప్రపంచాన్ని సృజించిన భగవానునికి నీవు వాసం, గ్రాసం ఇచ్చి పోషించగల వన్న శక్తి నీకున్ననాడు నీవే భగవంతునికన్న గొప్ప వాడవనబడతావ్. కాని, నీవీసుకార్యం యితరుల ప్రోద్బలం వలన చేసితివి గాన నీయమాయకత్వాన్ని కొల్లగొట్టి, జ్ఞానమార్గం నీకలవడునట్లు చేయక, నీచే యీపనుల్ని చేయించిన వారికే ఆసుకార్యాల ఫలితం చేకూరుతుంది. నీవు చేసిన పాపాలకు నీకు ఆధ్యాత్మిక అగ్నిశిక్ష.

గోపి—నా యినుపపెట్టి బీగాలు సరిగ్గా వున్నాయో, లేవో చూచుకొని రానివ్వండి బాబూ. ఇప్పుడే వస్తాను తమ సెలవైతే. (గోపిశెట్టితో పాటు కొందరు కింకరులు నిష్క్రమిస్తారు.)

[మరియొక ప్రాణితో కొందరు కింకరులు ప్రవేశిస్తారు.]

చిత్ర—ధర్మరాజా ! ఈ ప్రాణి మానవప్రపంచంలో రామిగాడని పిలువబడ్డాడు. ఇతడు దారులుగొట్టి ప్రయాణీకుల్ని హింసించి యీతని యజమాని వెంకట్రావు కాపు ధాన్యాన్ని వీలైనంతవరకూ దొంగిలించేడు.

యము—(రామినుద్దేశించి) నీవిందుల కేం చెప్పుకొంటావ్ ?

రామి—దొరా ! నేను బీదవాణ్ణి. నాకు పదిమంది పిల్లలున్నారు. మాకాపుగారిచ్చే బత్తెం నాకడుపుకే సరిపోయేదికాదు. నాపిల్లల్ని పోషించడం ఎట్లా ? మా కాపుగారిని 'ఈబత్తెం చాలదు బాబూ' అని అడిగితే అది నీకర్మం ఉంటేవుండు పోతేపో నీకు బ్రహ్మ అంతే వ్రాసేడన్నారు బాబూ. నాకు తెలియకడుగుతా దొంగతనం చేయాలన్న బుద్ధి ఎందుకు పుట్టాలి ? అది బ్రహ్మరాతలో లేదు బాబూ ?

యము—నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పు ?

రామి—చిత్తం బాబూ!

యము—మీకోలాగా, మాకోలాగ ఆ బ్రహ్మదేవుడు కర్మ నలా ఎందుకు వ్రాయాలో అడిగి తెలిసికొన్నావా, నీయజమానుణ్ణి?

రామి—అడిగేను బాబూ! దీనికి కారణం మేము పూర్వం జేసుకున్న పాపం అని చెప్పేరు.

యము—పాపాలు చేయడానికి కారణం ఏం అనీ అడిగేవా?

రామి—అలా అడిగితే నన్ను బతకనిస్తారా బాబూ?

యము—(కొంచెం యోచించి) చిత్రగుప్తా! ఈ సంగతిగూర్చి మనం తొందరగా బ్రహ్మకు వ్రాసి తెలుసుకోవాలి. ఆయన యిష్టంవచ్చినట్లు కర్మ వ్రాసేడంటే, మనకు శిక్షించేహక్కు పోతుంది. మన హక్కును మనం కాపాడుకోవాలి. (సెలవుదీసికొని చిత్రగుప్తుడు నిష్క్ర మిస్తాడు.) పూర్వం జేసిన పాపాల శేషముంటే, ఉత్కృష్టమైన మానవజన్మ ఎత్తడం అసంభవం. పూర్వజన్మలో చేసిన పాపాలఫలితం ఇంతకుముందు ఇక్కడనే పొందేరు. మానవుడు ఈ జగన్నాటకంలో ఒక పాత్రధారుడు గాని పాత్ర గాదని యిందుమూలంగా తెలియపరుస్తున్నాం. దానిని బట్టి నీవు శిక్షార్హుడవని స్పష్టమవుతుంది. కాని పైన జెప్పబడిన పాపాలు

చేయడానికి నీయజ్ఞానమే కాని నీవు కారకుడవుకావు. కనుక జ్ఞానవంతులం అని అనుకొన్నవారు నీబోటి జ్ఞానహీనుల్ని అజ్ఞానంనుండి తప్పించక స్వలాభం అపేక్షించి మిమ్మల్ని ఉపయోగించికొన్నందులకు. గాను మీరు చేసిన దుష్కార్యాల ఫలితం వారే పొందు తారు.

[3 వ ప్రాణి కింకరులు ప్రవేశము]

చిత్ర—ఈ ప్రాణి మానవప్రపంచంలో "జోగయ్యావధాని" అని పిలువబడ్డాడు. ఈప్రాణి ధనికులకు అనుకూలంగా వ్రాయబడ్డ పురాణాల్ని సమర్థిస్తూ అజ్ఞానుల్ని జ్ఞాన వంతులుగా చేయడానికిబదులు వారి యమాయక త్వాన్ని కొల్లగొట్టి సర్వవ్యాపకుడూ సర్వశక్తులూ గల ప్రపంచ సృష్టికర్తయగు భగవంతునికి ఆలయాలు కట్టించి, యారాధనచేసిన పుణ్యాం చేకూరునని చెప్పి భగవంతునిపేరిట సమాజంలో ఒక పరోపజీవివలె జీవించాడు. మూఢత్వంతో చెడునడత నడిచింది. ఈ చెడ్డనడతవల్ల చాల ప్రాణులికి నష్టంకలగడం తటస్థించింది.

యము—దానికి సంజాయిషీ ఏం చెప్పుకుంటావ్ జోగయ్యా!

జోగ — నేను స్వతంత్రించి నా యిష్టంవచ్చినట్లు చేయలేదు. ఏ పురాణాలు ఇక్కడ స్వర్గం, అక్కడ నరకం వుందని ఘోషించాయో వాట్ల ననుసరించియే నేను ప్రవర్తించా. కర్మలో కొందరికి జ్ఞానం మఱికొందరికి అజ్ఞానం, కొందరికి దారిద్ర్యం కొందరికి భాగ్యం వ్రాసి యుండనియెడల జ్ఞానశూన్యుడు మాబోటి జ్ఞానవంతుల సహాయం లేకుండానే జ్ఞానాన్ని సంపాదించుకో గల్గుతాడు. అందువల్ల భగవంతుని దృష్టిలో అందరూ సమానులుగారని నాకు గోచరించింది. అందరూ సమత్వంతో బుట్టిననాడు ఒకరినొకరు అజ్ఞానులుగ జేయుటకు గాని, ఒకరిని మరొకరు కష్టపెట్టడానికి గాని వీలు చిక్కియుండదు గదా యని నేనట్లు ప్రవర్తించాను.

యమ: — నీవు నిజంగా జ్ఞానవంతుడవు గావని నీమాటల్ని బట్టియే విశదమవుతుంది. నీకింతకంటె జ్ఞానం అబ్బటానికి అవకాశం లేకపోవడం నిజం. నీవు కాలమానపరిస్థితుల్ని అనుసరించి నడచుకోడానికిబదులు నీతాతముత్తాతలు తమ మితిజ్ఞానంతో వ్రాసిన వ్రాతల ననుసరించి ప్రవర్తించావ్. అందువల్ల నీకు సరియైన జ్ఞానంలేదని స్పష్టమౌతూంది. ఇదితప్ప వేరేమీ

లేదని ఆడంబరంగా వర్తించి సమాజానికి హాని కలుగజేశావ్. అందులకు నీకు ఇనుపరక్షలశిక్ష.

[శాకుంతల ప్రాణితో కింకరులు ప్రవేశం]

చిత్ర—ఈ ప్రాణి మానవప్రపంచంలో 'శాకుంతల' యని పిలువబడుతూ వుండేది. ఈమె వ్యభిచారవృత్తిని అవలంభించి జీవనం గడుపుతూ వుండేది. యీమెవల్ల చాలజనులు దుర్వ్యసన వృత్తికి పాలయ్యారు. ఆలయాల్లో నాట్యంచేసి చాలమంది భక్తుల్ని తప్పుదారిని నడిపించిందే కాకుండ, వారికి సుఖవ్యాధుల నంటించి, ఆరోగ్యస్థితి పాడుచేసింది. తన్మూలాన్ని పెక్కుమంది బాధపడి, త్వరలో ఆయుర్దాయాన్నికూడ కోల్పోయారు. వారు వారి చెడునడతకు ఫలితం అక్కడే పొందడంవల్ల మనకున్న శిక్షించే హక్కు నాశనమయింది.

యము—వ్యభిచారిణీ! నీవు నాఅధికారాన్నే నాశనంచేశావ్. ఇందుకు సంజాయిషీ యేం చెప్పుకొంటావ్ ?

శాకుం—అయ్యా! మానవలోకంలో నేను వ్యభిచారిణిగా జీవించక తప్పిందికాదు. ఈ వృత్తి మాయింట సాంప్రదాయకంగా వస్తోంది. దీనికి పండితులు శాస్త్ర

జ్ఞులూ అంగీకరించారు. శాస్త్రాలు ఒప్పుకొన్నాయ్. కొంతకాలం మేం కవులవల్లనే పోషింపబడ్డాం. కుల కట్టుబాటుల్ని బట్టి మా పెద్దలు నన్నీవృత్తిలోనే తర్ఫీదుచేశారు. దీన్నే అభ్యసించి కృషిచేశాను. వేరే వృత్తిని చేసుకొని బ్రతుకుటకు నా కవకాశం లేకపోయింది. ప్రభూ! నేను ఎవ్వరికినీ జాఢ్యాల నివ్వలేదు. మానవుల్లు చేసిన తప్పిదాల ఫలితం భూలోకంలో పొందునట్లున్నా చేయలేదు. ఈ జాఢ్యాల్ని నేను సృష్టింపలేను; సృష్టి బ్రహ్మపని.

యము—(ఆగ్రహంతో) చిత్రగుప్తా! ఈ ప్రాణి చెప్పింది వింటివా. పదిహేనవ శతాబ్దంనుండి బ్రహ్మ మనకు ప్రతివిషయంలోను అడ్డువస్తున్నాడు. అతనికి సృష్టించే హక్కేగాని శిక్షించే హక్కెక్కడిది? ఇక మనం కూడ సృష్టించుట ప్రారంభించిన బాగుండును. అప్పుడు గాని అతనికి బుద్ధిరాదు.

శాకుం—మరియు — ... ...

యము—ఆగు, నీవు వ్యభిచరించడంవల్ల బ్రహ్మకు ఆరోగాల్ని సృష్టించడానికి అవకాశం కలిగింది. అందువలన సమాజంయొక్క ఆరోగ్యాన్ని నాశనంచేసినదానవయ్యావ్. ఈ వృత్తిని ఖండించుటకు బదులు యిది కులధర్మం,

న్యాయసమ్మతం అని సమర్థించిన దుర్నీతిపరులు నీతో బాటు ఆపాప ఫలితాన్ని అనుభవిస్తారు.

శాకుం—ఎంతకాలం హిందూసమాజం నాబోటి అబలలను అవమానంలో పెట్టుతుందో, ఎంతకాలం సమాజం మాశరీరాలతో వ్యాపారంచేసి సుఖింపవలెనని కోరుతుందో, ఎంతకాలం సమాజం ఇట్టి దుష్కార్యాలను చేయడానికి అవకాశం ఇస్తుందో, అంతవరకూ హిందూ సమాజం అనారోగ్యంగా ఉండవలసిందే. అంతవరకూ ఈ వృత్తిని పోషించిన మానవుల గృహాలలోకూడ వ్యభిచారం ప్రబలవలసిందే. నే నమాయకురాల్ని. అజ్ఞానంవల్ల నేనుచేసిన దుష్కార్యాలకు, నన్ను క్షమించండి.

యము—(కొంచెం ఆగి) విచారణకు వాయిదా పడింది. (కింకరులు ఆప్రాణితో నిష్క్రమిస్తారు.)

[స్వాములవారితో కింకరులు ప్రవేశము]

చిత్ర—ఈజీవి మానవ ప్రపంచంలో స్వాములవారని పిలువఁబడ్డాడు. ఈయన కొన్ని బీజాక్షరాలను చిన్న రాగి ముక్కమీద వ్రాసి ఇది యంత్రం ఇది యెక్కడ వుంటుందో అక్కడ భగవంతుడు వుంటాడని ఆలయాలు

కట్టించి మూఢప్రజల సొమ్ము రాళ్లపాలు చేశాడు. భగవంతుని పేరట ఎన్నో దురాచారాలు చేశాడు. వ్యభిచరించాడు.

యము—దీని కేమి చెప్తావ్?

స్వామి—నే నేశరీరంతో ఈదుష్కార్యాలు సలిపితినో ఆ భౌతిక శరీరాన్ని అక్కడే విడిచాను.

యము—నీవు నీశరీరమును వశపరచుకొని తద్వారా ప్రకృతిని జయించుటకు బదులు దానికే నీవు బానిసవై సమాజానికి అపారమైన హాని కలుగజేశావు.

స్వామి—ప్రకృతిని పలుకుబడిచేసి జయించగల శక్తి నాకున్న యెడల నేనే భగవంతుడ ననబడుదును. అట్టి పరిస్థితులలో నేనిక్కడ కెందుకు వస్తాను. విశ్వామిత్రుని వలె మరియొక ప్రపంచమును సృష్టించేవాడనే.

యము—విశ్వామిత్రుడు మొదలైన మహర్షులు ప్రకృతిని జయించుట వల్లనే అంతటి ఆత్మబలాన్ని సంపాదించగలిగేరు. అందువల్లనే వారు పరబ్రహ్మస్వరూపంలో ఐక్యమయ్యేరు. అందువల్లనే మహనీయులైన వసిష్టుడు, గౌతముడు, కణ్వుడు, వ్యాసుడు మొదలైనవారు భగవంతుని ఏకోనారాయణ, సర్వాంత

ర్యామి, పరబ్రహ్మస్వరూప, ఆదిశక్తి, నిర్గుణుడు అని పిలువగలుగు చున్నారు. నీబోటులు విద్యుచ్ఛక్తిని తీగెలో బంధించినట్లుగా సర్వాంతర్యామి యగు భగవంతుని గూడ యంత్రంవేసి రాళ్లలో బంధించెదనని ప్రజలను మోసగించారు. నీవు జ్ఞానివి కావని తెలిసికొన్ననాడు యిట్టి దుష్కార్యాలను చేయు టెట్లు సంభవించును ?

స్వామి—మీరుదహరించినట్లు యీ విషయంలో అజ్ఞానమే కారణభూతం. నేను నిందార్హుడ నెట్లగుతా? ఇంతకు మావంటివారు వుండబట్టే ఇక్కడ యమలోకం, అక్కడ స్వర్గలోకం ఉన్నాయన్న నమ్మకం మానవ లోకంలో నశించకపోవడానికి కారణం. దేవుడు, ఆత్మ, పునర్జన్మ ఉన్నవన్నందులకా యీ ప్రారబ్ధకర్మం? రక్తమాంసాలతో కూడుకున్న శరీరం నామతిని చలింపజేస్తే నాదా తప్పు? ఆ పరిస్థితుల్ని సృష్టించిన బ్రహ్మదా? జ్ఞాని అనుకొన్న విశ్వామిత్రుడే మేనకకు లోబడ్డాడు.

యమ—జ్ఞాని యనగా తన్నుతాను తెలిసికొన్నవాడు. అతడు భగవంతునితో సమానుడు. పునర్జన్మను వాంఛింపడు.

నీవు చెప్పినట్లు రక్తమాంసాలతో కూడుకొన్న శరీరం లో తిరిగి ప్రవేశింపవు.

స్వామి—భగవంతుడే మానవజన్మ మెత్తిననాడు, యీ జ్ఞాని యనగా యెంత? భగవంతుడే భోగాతురు డయ్యాడు. రాముఁడు, కృష్ణుఁడు ఎవరు?

యమ—అంతటితో కట్టిపెట్టు. నీవిషయంలోకి భగవంతుని యెందుల కీడుస్తావ్? పునర్జన్మ కావాలని కోరినవా రికే యమలోక, స్వర్గలోకాలు నిర్మింపబడ్డాయి. పున ర్జన్మ లేదన్నవారు పునర్జన్మ మెన్నటికి పొందరు. భగవంతుడు లేడన్నవారు భగవంతుని చూడరు. ఆత్మ లేదన్నవారు తమ్ము తాము తెలిసికోలేరన్నమాట. నీకు యేమీ తెలియకపోయినా సర్వం తెలిసినట్లు ప్రవర్తించుటయే గాక, వ్యభిచరించి సమాజానికి హాని కలుగజేసినందుకు నీవు ఆధ్యాత్మిక యినుపకాకలశిక్ష ననుభవించిన పిమ్మట ఆడుదయ్యమై తిరిగి భూలోకం చేరుకొంటావ్. అదియే నీ పునర్జన్మ. అచ్చట నీవు యిదివరలో అంధకారం అనే అజ్ఞానంలో నింపిన ప్రజ లకు రాత్రులందు కనిపించి భయపెట్ట గలుగుతావ్.

నాటకం బీభత్సమైంది. నటకులకు చిన్న చిన్న గాయా లు తగిలేయి. కూలీలంతా శర్మవైపు వక్రసారిగా చూశారు.

శర్మకూడా వారి ఆత్రుతను తెలుసుకున్నాడు. అతనినోటినుండి వచ్చిన వక్కమాట చాలును, దుండగీంద్రను స్మశానం పాలు చేయడానికి. కాని యేం చేస్తాడు యీ శాంతమనస్కుడు ?

అతని మేనమామ సాహసానికి కారణం తెలుసుకున్నాడు. మిత్రులను తీసుకొని ఇంటికి చేరుకున్నాడు. తన గ్రామప్రజలలో తనకు గల పలుకుబడివి గురించి రహస్యంగా తనలో తాను గర్వించుచున్న శర్మకు, తనమిత్రులకు జరిగిన అవమానం విచారం గలుగజేసింది. కాని మానవసేవ చేసిన ప్రతి మానవునకు ఇట్టి కష్టాలు తప్పవని తెలుసుకొన్న మిత్రులు శర్మ నోదార్చ గలిగేరు.

తొలికోడి కూసింది. కామ్రేడ్స్ తిరిగి పదిగంటల కొస్తామని చెప్పి పెద్దాపురం వెళ్ళడానికి శర్మగృహం విడిచి పెట్టేరు.

పాపం శర్మకు దుఃఖ మాగిందిగాదు. కంఠ్ఠనుండి నీరు కారింది. అంతలోనే ధైర్యం తెచ్చుకొన్నాడు. నేను పిరికివాడనా యని తనలో తాను ప్రశ్నించుకొన్నాడు.

కాదు శర్మ ధైర్యశాలి. "టాలస్టాయ్" వ్రాసిన "War and peace" అను గ్రంథాన్ని తీసి చదువుటకు ప్రారంభించేడు. కాని ఆతని మనస్సు చదువుమీదకు పోదు. తెల్లవారితే 1942 సం॥రం జూలై 14 వ తేదీ.

# కర్మఫలం

తన గడియారంలో క్రొత్తటైము ప్రకారం ఆరైంది. కిటికీ తెరచి బైటికి చూసేడు. కాకులు అరవడం వినిపించింది. కాని వెలుతురు రాలేదు. ఆలోచిస్తూ నిలబడ్డాడు. కాల చక్ర మాగుతుందీ? దాని కార్యాన్నది నెరవేర్చుకుంటుంది. ఏడుగంటలైంది. వెలుతురు రాలేదు. పైకి చూసి ఆకాశం మేఘాలమయం అయిందని తెలుసుకొన్నాడు. అట్టి పరిస్థితుల్లో సూర్యుడు కనిపించకుండా కొంతసే పుండడం సహాజం. కాని కొద్దికాలంలోనే తిరిగి కనిపించేడు. పాపం మూఢప్రజలకు కనుపించక పోతే భోజనం చేయరని కాబోలు! ఈ ఆచారం అక్కడవుంది. దీనిని వయోవృద్ధులు ఎక్కువగా పాటిస్తారు. చీకటిస్థానం వెలుతురు వెలుతురుస్థానం చీకటి ఆక్రమించుకోవడానికి ప్రయత్నించేయి. ఈవిధంగా మూడుసార్లైంది. ఉరుమడం ప్రారంభమైంది. చివరకు చీకటే గెల్చింది. తాత్కాలికంగా అనుకోవచ్చు.

గాలివర్షం ప్రారంభమైంది. ఒక గంట బ్రహ్మాండంగా వర్షించింది. దీని పర్యవసానం వేసవిధూళితో నిండిన గొప్పవారి గృహాలు శుభ్రపడ్డాయి. బీదవాళ్ళుయిళ్ళో? పాపం వేసవి మొదలకు కాలికాలి వున్నవేమో కూలేయి. ఏమిచేసేది! యథాప్రకారంగా రాత్రి నిర్ణయించుకొన్నట్లు కూలీలు వరి యూకు నూడ్చడానికి బైలుదేరేరు. విచారంగా వున్నాయి

వారి ముఖాలు. చూసేవారికి వారి ముఖాలే చెబుతున్నాయి-కట్టడానికి బట్ట, తినడానికి తిండి, ఉండడానికి గృహం లేనిస్థితిలో వున్నారు వారని. భూస్వాములో, పొగాకుచుట్టలు నోటిలో పెట్టుకొని చేపేటి కర్రలు చేతిలోపట్టుకొని దివ్యమైన వారి సౌధాల్లోనుంచి బైటపడ్డారు.

వర్షపునీరు సెలయేళ్ళవలె వీధుల్లో ప్రవహించి ధాన్యపుమర వెనుకనున్న తూముగుండా కాలవలో కలుస్తుంది.

శర్మ శ్రీమన్నారాయణ ఒకరితరువాత నొకరు రేవు దగ్గరకు చేరుకొన్నారు. శర్మ వయస్సు 23 సంవత్సరాలు. ఎత్తు 5 అడుగుల 6 అంగుళాలు. నేత్రాలు విశాలమైనవి. తల వెంట్రుకలు వుంగరాల్లాగ వుంటాయి. ఛాయ తెల్లనిది. వయస్సుకు ఎత్తుకు సరిపడ్డ శరీరపుష్టి కలిగియున్న మంచి రూపవంతుడు. ఇతడు కనిపించినప్పుడు స్త్రీపురుషు లెల్లరు కనురెప్ప వేయకుండా అతనివంకే చూచేవారు. దానికి తగినట్లు అతనిది గొప్పబుద్ధి.

శ్రీమన్నారాయణుని ఎత్తుకూడా రమారమి ఆరడుగులు. వయస్సుకు శర్మకంటె ఒకసంవత్సరం చిన్న. ఇతను కూడా రంగుకు తెలుపు. కండ్లు పిల్లికండ్లు. తలవెంట్రుకలు రాగిరంగుగలవి. శర్మలాగే ఖద్దరు కట్టేడు. హాస్యంగా మాట్లాడుతాడు.

శర్మ—చూశారా! రాత్రి మనభక్తులు చేసిన పని?

శ్రీమన్నారాయణ—యెవరు? భక్తులా? భక్తులు కొట్టేద రంటే నేను నమ్మను.

శర్మ—వెఱ్ఱివాడా! భక్తులు దుష్కార్యాలు చేయరు; వారు మతంపేరిట దాండగీండ్రను ప్రేరేపించి దురంతాలు చేయిస్తారు. లేకపోతే హిందూ మహమ్మదీయ కలహాలు ఎందుకు వచ్చాయి?

శ్రీమన్—అయితే, రాత్రి నాటకశాలలో నటకులను కొట్టి నందుకు కారణ మెవ రంటావ్?

శర్మ—ఎవరా? బూటకపు మాటలు చెప్పి సాలేనా ఆరు వేలు ఆదాయంవచ్చే ఆస్తిని ఆర్జించలా? కూతురుని, భార్య, ఆ మాయముండా సంబంధం వద్దని ఎంతచెప్పినా, పిల్ల ఎంత ఏడ్చినా వినక ఆస్తి కలుస్తుందని ముసలిముండాకొడుకిక్క చేయలే? అతడూ, మరెవరు యగ్గన్నశాస్త్రి, కాంమేడ్సు నాటకం వేస్తారని తెలిసి పెద్దకాపులదగ్గరకు వెళ్ళి మతమూ భగవంతుడూ లేడు అని అంటే కూలివాండ్రంతా తిరగబడేతారని ఎన్నో కల్పించి చెప్పి ఆ చదువుకోని మూర్ఖులికి పిచ్చి ఎత్తించేడు. ఇంతకూ చదువుకున్నవాళ్ళ

ఎంతోమంది లేనందువల్ల మనదేశాని కింత ముప్పు వచ్చింది. ఎంతమందుంటే ఏం లాభం? చదువులేనిదే? చూడు, యగ్గన్న రెండుముక్కలు చదివేడో లేదో కాని అమాయక ప్రపంచాన్ని ఎలాగు పరిపాలిస్తున్నాడో? ఇదెంతకాలం? మనమూ చూద్దాంగా?

శ్రీమన్—అందుకే అనుకుంటూ, రోజూ మనదగ్గరకువచ్చే రామశాస్త్రి నిన్న స్మశానం కనుపించలేదు. ఐతే మీరు ఏమిచేయదలచుకున్నారు?

శర్మ—వెఱ్ఱివాడు. యీవిషయంలో మనకు తలవనితలంపుగా చాలా లాభం చేశాడు. వాడు ఆ దుష్కార్యం చేయించడంవల్ల సనాతనులంటే యిప్పటికే చాలామంది యువకుల్లో అయిష్టం ప్రబలింది.

శ్రీమన్—అదేకాదు— ఈ దొంగభక్తులకు పాపపుణ్యాల్లోను, పునర్జన్మలోను నమ్మకముంటే, రాత్రి యింతటి దుష్కార్యం చేయరు. పాపం వాళ్ళను అన్యాయంగా కొట్టేరు. కాని యీవిషయంలో పెద్దకాపులను నిందించకూడదు. వారికి కర్రపెత్తనం చేయడం తప్ప మరేమీ తెలియదు.

శర్మ—వీరి నమ్మకంతో మనకు పనిలేదు. నిజంగా పాప

లోకం పుణ్యలోకం వున్నావనుకో. ఐతే వీరెవరు మనలను శిక్షించడానికి ? అది యమధర్మం.

శ్రీమన్—ఎవరా ? ఎవరికి మనముచేసేది తప్పుగా తోచిందో వారే. ఇది సనాతనధర్మం.

శర్మ—ఐతే సనాతనధర్మం, యమధర్మం, ఒకటికాదూ ?

శ్రీమన్—ఓహో ! ఎందుకా[illegible]వు. నీవింకా పెరటిత్రోవనే వున్నావు.

శర్మ—మనంచేసేది తప్పని యమునికి తోచనక్కరలేదా ?

శ్రీమన్—ఎందుకూ ! ఇది మంచి అది చెడ్డ అని మన యగ్గన్న యముడికి తెలిపితే, అతడు అప్పుడు తప్పు జేసినవారిని బాధపెడతాడు.

శర్మ—యమునికి స్వతంత్రబుద్ధిలేదూ ? ఎవరేంచేయమంటే అది చేయడమే దున్నపోతులాగ.

శ్రీమన్—మరేమనుకున్నావు. వాడు దున్నపోతుమీదే ఎక్కుతాడు. అది సహవాసదోషం. మన పెద్దకాపులకుమల్లే యముడు కూడా మొద్దే. పండితులంతా చందావేసుకొని అమెరికాలో తయారుచేయబడ్డ ఒకడు కూర్చునే విమానాన్ని కొని యమునికి పంపుతే, ఆ దున్నపోతువాహనాన్ని విడిచిపెడతాడు. అప్పుడుకాని అతనికి స్వతంత్రబుద్ధిరాదు.

శర్మ—కొందరు శాస్త్రజ్ఞులు యమలోకం దేవేంద్రలోకం అనేవి లేవు; కాని పునర్జన్మ వున్నదన్నారు. ఈ జన్మలో పాపంగాని పుణ్యంగాని చేసినవారు మానవ జన్మమెత్తి ఆఫలితాలను ఇహలోకంలోనే పొందు తారు అని అంటున్నారు.

శ్రీమన్—అందువల్లేనా యగ్గన్నశాస్త్రికి పాపం పుట్టినప్పుడే ఒక కన్ను లేదట.

శర్మ—మన యగ్గన్న చేసుకొన్న కర్మ యిక్కడ అనుభవించడే. అతడు తిన్నగా యముడుదగ్గఱకే వెళతాడు. ఇక్కడ అనుభవించేది యమలోకం లేదు కాని పునర్జన్మ వున్నదన్న నవీన వేదాంతులు.

శ్రీమన్—ఐతే పిచ్చివాళ్ళ పిచ్చి కాలమానపరిస్థితులను బట్టి మారుతుందన్నమాట.

శర్మ—ఎవరికోసం, కాని వీరి వ్రాతలుకూడా పాతబడ్డాయి. ఫ్యూడలిజం మారి ధనికవర్గం, అది మారి సామ్యవాదంవచ్చే రోజుల్లో పునర్జన్మ, పాపఫలితం, ఉన్నవన్న అభిప్రాయాలు, వుండాలన్న కోరికలు విడిచి, నూతన పరిస్థితులకు అనుకూలంగా మానసిక ప్రపంచంలో వుద్భవించిన నూతన భావాలకు సమాజం స్వాగత మివ్వాలి. సమాజంలోని ప్రతిమానవుడు సమాజం

పట్ల అతనికి గల బాధ్యతను తెలుసుకోవాలి. ఏమానవుడైనా సమాజానకు హాని కలుగునట్లు ప్రవర్తించిన అట్టి మానవుని శిక్షించు హక్కు సమాజానికే గలదని ప్రతిమానవుడు ఒప్పుకోవాలి. ఇంతవరకూ భగవంతునిమీద త్రోసివేసిన భారాన్ని బాధ్యతనూ అతడే వహించాలని ప్రతి మానవుడు గమనించాలి. నిజంగా పునర్జన్మవుందని వప్పుకొన్ననాడు యమలోకముందని కూడ వప్పుకుతీరాలి. ఎందువల్లనన, యీజన్మలో చేసిన పాపాల ఫలితం మరొకజన్మయెత్తి యిహలోకంలోనే అనుభవించవలె నన్ననాడు జన్మతోబాటు పాపాలు వెంబడించును. అది నిజమైన, పాపాల భైరవునకు వుత్కృష్టమైన మానవజన్మ మెత్తు భాగ్యం ఎట్లులభించును. దీనికి దృష్టాంతం రామశాస్త్రిబాబు రాత్రి చూపించ లేదా? అతని దుష్టప్రవర్తన అతను పెంచి పోషిస్తూన్న యమలోకాన్నీ నవీనవేదాంతులు బలపరచుచున్న పునర్జన్మనూ ఇహలోక యమలోకాన్నీ నాశనం చేసింది. మనది తప్పే అని వప్పుకుందాం. అయితే దానికి ఫలితం అప్పుడే పొందలేదా?

శ్రీమన్—ఈ జైళ్లెందుకొచ్చాయ్? ఈవేళ ఖూనీచేసిన వాడు యీ జన్మలో శిక్షింపబడ్డంలేదా?

శర్మ—వీరు మరొకటంటున్నారు. మానవుడు ఒక జన్మలో పాపాలు ఫలితం అనుభవించేవరకూ పురుగో, పక్షో, జంతువో అయి పుడతాడు. పూర్తిగా అనభవించిన పిమ్మట తిరిగి ఆజీవి మానవజన్మ యెత్తుతాడట.

శ్రీమన్—ఐతే చామర్లకోట గ్రామంలో ఖూనీచేసిన నిందారోపణ చేసి గ్రామంలో ఆరుగురు మంచివార్ని కారాగృహంలో పారవేశారు. వీరు అన్యాయంగా బంధించబడ్డారని గ్రామంలో స్త్రీ పురుషులందరకూ తెలిసిన విషయమే. నా అభిప్రాయంగూడ అదే. వీరు హత్య చేయకపోయినా కష్టాల పాలయ్యేరు. వీరికి అంతటి కష్టం యెందుకు సంభవించింది ?

శర్మ—అదంతా ఎందుకు ? ఏమీ తెలియని పసిపిల్లలు బండ్ల క్రింద బడి అంగవిహీన్లు కావడం లేదూ ? ఎంతమంది విధవరాండ్రు వ్యభిచరించి మానాన్ని కాపాడుకోడానికి వారికి కలిగిన పసిపాపల ప్రాణాల్ని తీయడంలేదు

శ్రీమన్—ఇది "కర్మఫలం" అని వప్పుకోమూ ? కర్మఫలం అని వప్పుకున్ననాడు మానవజన్మలో చేసిన పాపపుణ్యాల ఫలితం మరొకమానవజన్మయే ఎత్తి పొందాలని తెలుసుకోరూ ?

శర్మ—ఐతే మంచిచెడ్డల వ్యాపారాలు చేసిన జీవికి లాభ నష్టాలు యీ జన్మలో తెలియవన్నమాట.

శ్రీమన్—మాటలటోయి. ఎన్ని వేల తూర్పుయిండియా సంఘాల్ని కలుపుతే యింతటి కంపెనీ అవుతుంది. భగవంతుడు మాత్రం మనిషి కాడూ. పెళ్లాం బిడ్డలు లేరూ. రెండువందలకోట్ల ప్రజలకు సమాధానం వెంటనే చెప్పడం మాట్లా ?

శర్మ—మా యింటికిపోయి సావకాశంగా చేయవలసిన కార్యక్రమాన్ని నిర్ణయించుకొందాం. అంతలో కామ్రేడున్నూ వస్తారు.

[సత్తిరాజు ప్రవేశం]

సత్తిరాజు—నమస్కారమండీ శర్మగారూ !

శర్మ—నమస్తే ! కూర్చోండి, అత్తవారింటినుండి ఎప్పుడొచ్చారు ?

సత్తి—ఈ వేళేనండి. బడిపిల్లలువచ్చి మనవూళ్లో నాటకం వేస్తే గందరగోళం జరిగిందటెందుకండీ ?

శర్మ—అది మీ పెద్దకాపులు చేసినపని.

సత్తి—అది నేను ఒప్పుకోనండోయ్. ఇదిఅంతా మీ బ్రాహ్మల్లు చేయించిన పని. లేకపోతే, దుక్కిదున్నుకొనే

మావాళ్ళకేం తెలుసు. ఇదివరకు మీరనలే, చదువు కోకపోతే ఏమీ తెలియదని?

శర్మ—మీవాళ్ళకాజ్ఞానముందా?

సత్తి—జ్ఞానముంటే మీరుచెప్పితే మీమాట, వారుచెప్పితే వారిమాట వింటామలండి?

శ్రీమన్—సత్తిరాజూ! చూడు, యగ్గన్న మిమ్మల్ని ఎల్లా మోసం చేస్తున్నాడో. యమలోకంవున్నదని మీతో చెప్పి సామ్యవాదులను మీవాళ్ళచే కొట్టించాడు. అది పాపం కాదూ? అలాంటి పాపాలు చేయించి పెద్దకాపుల్ని యమలోకంలో పారవేయిద్దామని కాబోలు వాని ఉద్దేశం. ఈ విధంగా వాడు బూటకాలు చెప్పి డబ్బు ఆర్జించేడు.

సత్తి—నాకు తెలియకడుగుతాను. యమలోకం ఎక్కడా లేనే లేదంటారా?

శ్రీమన్—మాకు తోచినంతవరకు లేదనే చెప్పాలి. ఒకవేళ యగ్గన్న జ్ఞానానికి వున్నట్లుతోస్తే అది అతనికోసం అతనివంటి డబ్బున్నవాళ్ళకోసం సృష్టింపబడి వుండాలి. ఎందువల్లనంటే అతనిలాంటి పలుకుబడి వున్నవాళ్లూ, డబ్బున్నవాళ్ళు అన్యాయాలు చేసినా వుద్యోగస్తులకు

లంచాలిచ్చి ఇహలోకంలోని కష్టాలను తప్పించుకో గలుగుతున్నారుగనక.

[రాధాకృష్ణుడు, సుందరుడు, మోహనుడు మొదలైనవారి ప్రవేశము]

శర్మ—హల్లో ! కామ్రేడ్సు !

రాధాకృ—సుదినం.

శర్మ—దయచెయ్యండి. వాతావరణం మనకు చాలా అనుకూలంగా మారింది. కాని దగ్గఱదగ్గఱ పదకుండుగంటలయింది. సాపాటుచేసి నావకాశంగా సంభాషించుకొందాం. రాధాకృష్ణగారూ! మీరు మాంసభక్షకులనుకుంటాను ?

రాధా—నాన్ సెన్సు. నేనేకాదు ఇకముందు హిందూదేశంలో ఎవ్వరుకూడా మాంసభక్షణ చేయకుండా ప్రయత్నిస్తాను. జ్ఞానాభివృద్ధి కలగాలంటే మన శీతోష్ణస్థితి కనుగుణ్యంగా వుండే శాకాహారాల్ని తినాలి.

శ్రీమన్—అదెలా ? మాంసంతినే బ్రాహ్మణేతరులలోమాత్రం ఎంతమంది మేధావంతులు లేరు ?

రాధా—లేరనికాదు నాయభిప్రాయం. కాని వారిమేధస్సు శాకాహారాల్ని తింటే మరింత వృద్ధిపొందడాని కవకాశం

వుందనీ. అందువల్లనే బ్రాహ్మణులు శాకాహారాల్నే భుజిస్తారు. మాంసాహారం మత్తు కలుగజేస్తుంది. లేక పోతే హిందూసమాజంలో బ్రాహ్మణుల తరువాత అగ్రస్థానం ఆక్రమించుకొన్న క్షత్రియులు మాంస భక్షకులుకావడం వారికంటే తక్కువకులస్థు లనబడు తున్న వైశ్యులు శాకాహార్లు కావడం ఏలాసంభవిం చింది ? అదంతా ఎందుకు. మాంసభక్షణ చేయనిదే శరీరారోగ్యాన్ని కాపాడుకో లేని శీతలదేశపు ప్రజలే వేడినిచ్చే గుణం, వెన్న, తేనె, మొదలైన వస్తువుల్లో కూడ వుందని పరిశోధనలవల్ల తెలుసుకొని మాంస భక్షణ మానగలుగుతున్నారు.

శర్మ—నీవు చెప్పిందంతా నిజం. వైశ్యులు వ్యాపారం చేసేవారు గనక శాంతపరులై ఉండడం అవసరం. అందువల్లనే వారు క్రోధం పుట్టించే మాంసం మొద లైన వస్తువుల్ని విసర్జించడం తటస్థించింది. ఇంతకూ కులాలు వృత్తిని బట్టి ప్రారంభదశలో వచ్చేయి. తరు వాత వారివారి అనుకూల్యాన్ని బట్టి వివాహాల్ని చేసుకోసాగారు. కొంతకాలానికి యిది మరచి కులాం తర వివాహాల్ని బహిష్కరించింది సమాజం.

కర్మఫలం

రాఘా—అందువల్లే, మతద్వేషాల్లాగే మనదేశంలో కులద్వేషాలు పుట్టేయి. ఈ కులకలహాలే హిందూదేశాన్ని యీ దుస్థితికి తీసుకొచ్చాయి. అందువల్లే అస్వాతంత్ర్యపు హిందూదేశపు ప్రజలకు ఖండాంతరపు నగరాల్లో కూడా స్థానం లేదు. ఎన్నిపర్యాయాలు మన ఆంగ్ల కామ్రేడ్సు కామన్సుసభలో యీ విషయాన్ని గురించి ప్రశ్నించలేదు? ఈ కులాలున్న దేశం యీ అస్పృశ్యతున్నంతకాలం మనకు దాస్యవిమోచన లేదనుకోవలసిందే. హిందూమతం క్షీణించడానికి యితరమతాలు హిందూదేశంలో తలయెత్తడానికీ గూడా కారణమిదే!

శర్మ—సరే భోజనానికి లెండి.

[భోజనానంతరసమావేశం]

మోహన్—కామ్రేడ్! ఇది విన్నావా? ఈమధ్య పెద్దాపురం ఒకస్వాములు వచ్చాడు. ఆయన పీఠాధిపతట. ఏనుగులు, వాహనాలు, డప్పు, డవాళ్ళతో వచ్చాడు. ఈయన్ని చూస్తే పుణ్యం వస్తుందని ఒక బోడావిడ అక్కడకు వెళితే, నేను వితంతువుని చూసేను. అందువల్ల భోజనం మానాలి, అని అం

దరిలోనూ అంటే ఆమె సిగ్గుపడి యేడ్చిందట. అతనికి ఆడవాళ్ళను అంత పరిశీలించి చూడవలసిన పని యేమిటో ?

శర్మ—ఆమె బోడావిడ కాదు. సకేశిని, అంటే వెండ్రుకలుతో ఉన్న విధవరాలు.

మోహన్—ఎక్కడ ?

శర్మ—ఎక్కడేమిటోయ్ పిచ్చివాడా ! నెత్తిమీద. దీనికి కారణం ఆయన జగద్గురువు. అనగా ప్రపంచంలో వున్న అంధకారం అనే అజ్ఞానాన్ని నిర్మూలంచేసే వాడు. కేశాలు నల్లగా అంధకారాన్ని పోలివుండవూ ? అందుచేతే ఆయన............

మోహన్—అయితే ఆయన పస్తుండడ మెందుకూ ? క్షవరం చేసే కత్తి ఒకటి తీసుకుంటె వదలిపోయేది.

సుందర్—ఎవరికైనా చూసినప్పుడు మతి చలిస్తే స్వాములు చేసే పనేమో అది.

మోహన్—మతి చలించడానికి భోజనానికి సంబంధమేమిటోయ్ పిచ్చివాడా ?

సుంద—సరే రెండుదినాలు భోజనము మానెయ్యి నీకు మనోవికారాలు ఎక్కడుంటాయో చూస్తాను.

రాధాకృష్ణ—సరేలేవోయ్, నీవు అస్ఖలితబ్రహ్మచారివి. ఆ విషయాలన్నీ నీకెందుకు లే. అటువంటివి మాకు ఒదిలి పెట్టు.

మోహన్—అదేకాదు. ఇంకొక చిన్నతమాషా జరిగింది. ఆ స్వామిదర్శనం కావాలంటే చొక్కా తీసివేసుకొని రావాలని ఆజ్ఞాపించేరు. అందువల్లనే నేను ఈ చోద్యం చూడడానికి వెళ్ళలేదు. ఆయన్ని చూడాలని కోరే వారికి ఈశిక్ష ఎందుకో!

శర్మ—అందులోనేవుంది కిటుకు. అది అగ్నిపరీక్ష. ఈపరీక్షలో ఉత్తీర్ణులైనవారు, ఆయన యెదుటకు వెళ్ళినా మావూరి పెద్దకాపుల్లాగ, ఆయన చెప్పింది తప్పయినా, నిజమైనా, మంచైనా, చెడ్డైనా ప్రశ్నించకుండా ఆచేతుల్లేని స్వామికి, ఆయన పాదుకలమీద దక్షిణపెట్టి ఆచరణలో పెడతారు. మనమో ఆయన చెప్పింది తప్పనితోస్తే ఖండిస్తాము. ఆయన చొక్కా తీయమంటేమాత్రం నీవు తీసేవా? అటువంటి ఆత్మగౌరవానికి భంగంకలిగే పనులు ఎందుకు చేస్తాం. ఈవేళ చొక్కా అయింది. రేపు ధోవతులు విప్పుకు రమ్మంటాడు. ఈపనిని యే ఆత్మగౌరవమున్న మాన

వుడు చేస్తాడు. అంచేతే వేసేడు ఆలోచించి యీ భైరవ
చిటుకు.

సుంద—ఐతే ధోవతిలోకూడా వుందా ఏమిటి అజ్ఞానం?

శ్రీమన్—ధోవతిలో ఏవిటి, ఆయన బుర్రలోనే ఉంది.

మోహన్—ఐతే ఆయన చాలా తెలివిగలవాడని ఒప్పుకో
వలసిందే.

శర్మ—సందేహమా?

మోహన్—అంచేతే కాబోలు, హరిజనులు ఆయనదర్శనం
చేయడానికివస్తే ఎంతదూరానో వుండి చూడమన్నా
డట. వాళ్ళని చూస్తే ఆయన ప్రాయశ్చిత్తం చేసుకో
వాలట. ఇదేనా ఆయన జ్ఞానం.

సత్తి—ప్రాయశ్చిత్తం ఏటండో?

మోహన్—దగ్గరకురావో కామ్రేట్?

సత్తి—నాపేరు కామరెడ్డి గాదండీ.

శర్మ—కామ్రేడ్ అంటే స్నేహితు డన్నమాట.

సత్తి—స్నేయితుడటండీ అలా చెప్పండీ. నాకినబడతూంది
చెప్పండి. నే నక్కడికెందుకూ చుట్టగాల్చుకుంటున్నా.
నన్నుగూడా మీలో లెక్కేసుకోండి.

శర్మ—ప్రాయశ్చిత్తమంటే బ్రాహ్మణు డేదైనాశాని తప్పు

చేస్తే కులభ్రష్టుడు కాకుండా, ఆవుపేడ, ఆవుపంచితం, ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవునెయ్యి పంచకవ్యంచేసి ఆ నిర్భాగ్యుణ్ణి త్రాగమంటారు. అంతవరకూ వాడు కులభ్రష్టుడన్నమాటే.

సత్తి—ఏం బ్రాహ్మలండీ మీరు, అవ్వ! అది జబ్బుజేయదటండీ. మీకేమీ అశాయం లేదటండీ. మిమ్మల్ని సెయ్యమంటే సేస్తారా రేపు.

శ్రీమన్—మమ్మల్ని చెయ్యమనేవాళ్ళెవరు?

శర్మ—ఎవరంటావేమిటి, మనలను కులభ్రష్టం చేసేవరకూ యజ్ఞన్న నిద్దుర పోడటగా!

శ్రీమన్—ఎవరిదగ్గఱన్నాడు యీమాట. అతనన్నది నిలబెట్టుకుంటాడా?

శర్మ—ఎవరైతే వింటారో వాళ్ళదగ్గరంటాడు. అతనిమాట నిలబెట్టుకొనే దేముంటుంది. రేపు అదికాదు యిదంటే మాత్ర మెవరునమ్మరు. అతనిలో వాళ్ళకున్న గౌరవం యెక్కడికి పోయింది. అతను చేసేదంతా మన పెద్దకాపులకు లాభంగానే వుందిగా. అతను లేకపోతే వాళ్ళకు పంచాంగం చూసేవాళ్ళెవరు. పిల్లలకు పెళ్ళిళ్ళు చేయించేవాళ్ళెవరు.

సుంద—ఈయన చేతిలో యేమాత్రం హస్తున్నా జనాభా లెక్కలోనుంచే మనపేళ్ళు తీయించేస్తాడనుకుంటా.

శర్మ—అది ఒకపనా? జిజియాపన్నే విధిస్తాడు. రెండుకళ్లూ వుంటే.

సుంద—శుక్రాచార్యుల్లాగా అతనికి ఒక్కకన్నే వుండడం కారణ మేమిటండీ? పుట్టుకలోనే వచ్చిందా?

శ్రీమన్—అందుచేతే అతడు శుక్రనీతిని భోధిస్తున్నాడు. ఆయన ఆరాక్షసులకు గురువైతే యీయన యీ రాక్షసులకు గురువు. అది పుట్టుకలోనే వుందండి. ఆరోగ్యమంటే జ్ఞాపకం వచ్చింది. ఏమిటండీ సుందర్ గారు! మీరు వేసిన నాటకంలో యముడు వ్యభిచరించినవాళ్లను "మీరు సమాజంయొక్క ఆరోగ్యాన్ని పీల్చి పిప్పిచేసేరు" అని నిందించి శిక్షించినట్లుగా వుంది.

సుంద—అంటే వ్యభిచరించినవారియొక్క రక్తము సుఖవ్యాధులవల్ల చెడడాని కవకాశం ఉంది. వారి సంతానం అలాంటి రోగపీడితు లవుతారు అందువల్లనే పుట్టుకలోనే అంగవిహీను లవుతారు. విశాఖపట్టణంలో ధర్మ ఆసుపత్రికి వెళ్ళిచూస్తే అక్కడవున్న క్షయరోగులు

మొదలైనవారు, ఎక్కువగా వ్యభిచరించి ఆరో గ్యాన్ని నాశనం చేసుకున్నవారే. వ్యభిచారంవల్లనే ప్రపంచం జబ్బులమయం ఔషధాలమయం అయింది.

సత్తి—రక్తమే పాడవ్వగాలేంది మాలల్ని ముట్టుకుంటే ఏమండి.?

రాధా—హరిజనులకు మన గౌరవనీయులు దూరంగా వుండడంవల్లనే వాళ్ళల్లో స్త్రీపురుషు లారోగ్యంగా వుండడానికి కారణం. లేకపోతే యిక చెప్పేవా! మనకుమల్లే వైద్యులు వాళ్ళకు దొరుకుతారా ?

శ్రీమన్—వానియొక్క ప్రవర్తన సమాజానికి ఎలాంటి నష్టం కలిగించింది ?

సుంద—వ్యాధులు సామాన్యమా ! ప్రారంభదశలో కలరా ఒకనికే రావచ్చును. ఆక్రిమిని వెంటనే నిర్మూలించకపోయినట్లయితే పరిసరప్రాంతాలకు ప్రాకి ఎన్ని ప్రాణుల్నాహుతి చేసుకోడం లేదూ ?

శ్రీమన్—ఐతే యీవిషయంలో హిందూసమాజం మంచి పనే చేసిందన్నమాట.

సుంద—ఏమిటా మంచిపని ?

శ్రీమన్—వ్యభిచరించడం తప్పంది. అదేకాక భర్త చని పోతే స్త్రీని ముండామొయ్యమనలే ?

సుంద—వ్యభిచరించమని ప్రపంచంలో యేనాగరిక సమాజం చెప్పింది? భర్త చనిపోతే భార్య ముండామొయ్యాలీ? భర్తమాత్రం భార్య వుండగనే వ్యభిచరించవచ్చునా?

శ్రీమన్—సరే! భార్య కూడా వ్యభిచరించాలనా నీ వుద్దేశం?

సుంద—వ్యభిచరించడం మంచిదని నేను చెప్పేనా?

శ్రీమన్—అయితే దీనిని నిర్మూలం చేయుటెల్లా?

సుంద—దేశముఖ్ తీసుకొచ్చిన విడాకుల చట్టాన్ని అమలులో పెట్టడమే.

శర్మ—విడాకులచట్టం కొన్నికులాల్లో యిదివరకే వుంది. వాళ్లలోమాత్రం వ్యభిచారం లేదా? దీనంతకూ ధనికవర్గాన్ని అనుసరించియున్న దారిద్ర్యమే కారణం. వ్యభిచారాన్ని నిర్మూలించాలంటే దారిద్ర్యాన్ని నాశనం చెయ్యాలి. దీనంతకూ కారణం సమాజం యొక్క అనారోగ్యపు ఆర్థికస్థితే.

మోహన్—శర్మా! నీవు నిజంగా దుర్నీతిపరుని ఆయువుపట్టు మీాద కొట్టేవు. రష్యాలోవలె మనదేశంలో కూడ సామ్యవాద మొచ్చిన్నాడు ఈస్త్రీ కాకపోతే ఆస్త్రీ, ఆపురుషుడు కాకపోతే యీాపురుషుడు స్త్రీపురుషుల

కెల్లా లభిస్తారు. అప్పుడు కట్నాలకోసం పెండ్లిండ్లుంటాయా? వివాహాల్లో ప్రేమే అగ్రస్థానాన్ని ఆక్రమించుకుంటుంది. అటువంటిసందర్భంలో విడాకులకు మాత్రం చోటేది?

శ్రీమన్—శభాసు! అదే నేను కోరేది.

మోహన్—నీవేకాదు. మేం కోరేదీ అదే. పూర్వంనుంచీ విడాకులచట్టం ఆచరణలోవున్న అమెరికా, రష్యా, మొదలైన దేశాల్లోవున్న విజ్ఞానవంతులు కోరేదీ అదే! అమెరికాలో నూతనంగా కొన్ని సంఘాలు బయలుదేరి విడాకులు మంచిదికాదని ప్రజలను హెచ్చరించడంలే. రష్యాలోకూడ కమ్యూనిష్టు పక్షంలో చేరేవారికి ఇదిఒక నిబంధన.*

శ్రీమన్—రష్యాలో కుటుంబజీవితం లేదటకాదూ? ఆడవాళ్లనుకూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని మగవానికి తనభార్యమీాద హక్కు లేకుండా చేసిందట? స్వంతఆస్తి లేనట్టే స్వంతభార్యకూడా లేదట?

మోహన్—రష్యాలో ఉన్న కుటుంబజీవితం ధనికవర్గంలోని కుటుంబజీవితం వంటిదికాదు. ధనికవర్గంలో

---

* Soviet communism by
Sidney & Beatrice webb.

వలె రష్యాలో ఆడవాళ్లను అద్దికివ్వడంలేదు. రష్యాల్లో ఆడవాళ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకోదు. కాని ఆడవాళ్లను మగవాళ్ళ నిరంకుశాధికారంనుంచి కాపాడుతుంది. అక్కడ మగవాళ్లతో బాటు ఆడవాళ్ళుకూడా రాజకీయంగాను, సాంఘికంగాను, ఆర్థికంగాను సమానహక్కులు అవకాశాలు పొందేరు. అక్కడ వివాహజీవితం హెచ్చుతగ్గులు లేని త్రాసువలె సరిసమానంగా వుంది. ఈవిధమైన జీవితానికి రష్యాప్రజలు ప్రతికూలురుకారు. సామ్యవాదాన్ని నెలకొల్పి యీమార్పులు తీసుకొచ్చిన వారు రష్యాప్రజలే. ఆజీవితాన్ని వారు అంగీకరించేరు.

శ్రీమన్—రష్యాలోకూడా జర్మనీలోవలె నియంతృత్వమట. అట్టి పరిస్థితుల్లో ప్రజలకు ప్రభుత్వంమీద పలుకుబడి ఎట్లాస్తుంది ?

మోహన్—రష్యాలో సాముదాయకనియంత్రుత్వం. జర్మనీలో వ్యక్తిగత నియంత్రుత్వం. జర్మనీలో మానవుడు స్టేటుకోసం జీవితాన్ని నాశనం చేసుకొంటే రష్యాలో మానవుని మంచికోసం స్టేటు నాశనం కాబడుతుంది.

శ్రీమన్—సరే! ప్రస్తుతాంశంలోకి వద్దాం. ఒక స్వాముల వారు ఒకచోట ఉపన్యసిస్తూ, రాజదండన తప్పితే యమదండన తప్పదన్నాడట అదేమిటి?

శర్మ—ఆయన చెప్పినదాన్నిబట్టి చూస్తే, ఏజన్మలో చేసిన పాపఫలితం ఆజన్మలోనే రాజదండనంవల్లనో, లేక మరణానంతరం యమదండనవల్లో మానవుడు పొంది తీరాలి. పూర్వంచేసిన పాపాలశేషముంటే వుత్కృష్ట మైన మానవజన్మ ఎత్తడం దుర్లభం అని నాటకంలో యముడు చెప్పినట్టు వప్పుకు తీరాలి.

శ్రీమన్—ఐతే, యగ్గన్నకూతురు యీజన్మలో యేం పాపం చేసిందని కష్టపడవలసివచ్చింది? పాపం! వివాహమైన మూడునెలలకే ఆ ముసలిముండామగడు గంటకొట్టేడు. పిల్లను ముండా మొయ్యిబెట్టేడు. బాల్యం లో మగడుచస్తే పునర్వివాహం చెయ్యగూడదు? నిత్యం ఏడుపేనట పాపం స్నేహితురాండ్రను చూసి. మాచెల్లి చెప్పాతే నాగుండె కరిగిపోయింది. పాపం! యగ్గన్నభార్య మంచమెక్కి మరణించే స్థితిలో వుందట.

శర్మ— భాగ్యలక్ష్మి యీజన్మలోచేసిన పాపాలఫలితమే పొందుతోంది.

శ్రీమన్—ఏమిటా పాపం?

శర్మ—ఏమిటా? ఆ పాపాలభైరవునకు కూతురు కావడమే.

సుంద—ఐతే యగ్గన్న కూతురనుభవించేది ఏదండన?

శర్మ—ఇది యగ్గన్న దండన.

సుంద—యమదండన కూడా తప్పితేనా యీదండన?

శ్రీమన్—కాక!

శర్మ—ఏ పాపము చేయనివారిని భగవంతుడు యగ్గన్నలాంటి యములకు అప్పచెబుతాడనుకుంటా.

సత్తి—ఐతే, యగ్గన్నగారు ఆయనచేసిన పాపాల ఫలిత మెక్కడనుభవిస్తాడండీ?

శ్రీమన్—ఆయన ఏమిచేసినా పాపాల్లోకిరావు. ఆయన విధించేది దండనంటారు. పెద్దకాపుల్లాంటి మూర్ఖులు చేసేవి పాపాలు. అందువల్లే పెద్దకాపులు యగ్గన్న యేమిచెప్పినా శిరసావహిస్తారు.

సుంద—యగ్గన్నను ఆశ్రయించుకుంటే వారి పాపాలు పోతా యనుకుంటా!

శర్మ—ఒక్క దెబ్బలో! తానేకాదూ అది పాపం, ఇది పుణ్యం, అది మంచి, ఇది చెడ్డ అని నిర్ణయించేది?

శ్రీమన్—అదికాదు ! ఆయన పూజలు హోమాలు చేయించి మానవుడు చేసిన పాపాలను భగవంతునిచే తినిపించేస్తాడు. అలా చేయకపోతే దేవాలయాల్లో దీపారాధనకూడా లేకుండా చేస్తాడు. ఆదెబ్బతో భగవంతుడు వస్తుపరుండాలి !

సత్తి—ఆయన చెప్పినదల్లా నమ్మాలా ?

శ్రీమన్—మొదట ఖర్చుపెట్టడానికి వెనక్కు-జూసినా చివరకు వప్పుకుతీరాలి పెద్దకాపులు. లేకపోతే యిగ్గన్న మిమ్మల్ని యముడునోట్లో ఒక్క-సారిగా పారేస్తాడు.

సత్తి—నాకాభయము లేదండోయ్ !

శ్రీమన్—ఎవరికోసం సత్తిరాజూ ! ఆయన లేకపోతే మీ యింట్లో పెళ్లిళ్ళే ఆగిపోతాయి. అదంతా ఎందుకు బ్రాహ్మణుడు వచ్చి ఇవాళ వర్జముందంటే నీవు గడప దాటుతావా ? నిన్ను ఎక్క-డబంధించాలంటే అక్క-డ బంధించేశక్తి వుంది మాకు. రాజమండ్రీ కేంద్రకారాగృహం కావాలీ మీ పెద్దకాపుల కోసం ? మీ ఇల్లే రెండునిమిషాల్లో కారాగృహాన్ని చేయిస్తాం పనొస్తే. దగాచేసేవారికి అడ్డొచ్చేవారెవరు మీకు జ్ఞానం లేనంతవరకు ?

స త్తి—మొన్న శాస్త్రులుగారు కచేరీసావడిలో మాఅబ్బాయి నిజంగా ఖూనీచేస్నీ వాడిని వురిశిక్షనుంచి తప్పించేడని చెప్తున్నాడు. వానికి యమదండన వుంటుందాండి ?

శర్మ—సత్తిరాజూ ! అటువంటి ప్రశ్నకు యగ్గన్నే సమాధానం చెప్పగలడు. నీవు ఆయనను అడిగితే బాగుంటుంది.

శ్రీమన్—ఆయన చెప్పబోయే సమాధానం నేనే చెప్పగలను.

స త్తి—అదేమిటండి ?

శ్రీమన్—చంపబడ్డావాడు దుర్మార్గుఁడు. అంచేత చాలా మందికి కష్టాలు తప్పేయి కాబట్టి వాణ్ణి చంపితే పాపం లేదంటాడు. లేకపోతే వాడు పూర్వం ఎవరినో చంపేడు అంచేత యీజన్మలో చంపబడ్డాడు అంటాడు.

మోహన్—తప్పుచేసిన మానవుడు వాని కర్మను అతడే రాసుకుంటున్నాడా ? ఆలెక్కలో బ్రహ్మ యెక్కడున్నాడు ?

స త్తి—ఇదంతా విన్నతరవాత నేనూరుకుంటాను ? ఐతే రాజు కాకపోతే యముడూ దండించాలి. వీడెవడు ఖూనీచేసి దండించడానికి.

శర్మ—ఈ ప్రశ్న ముఖ్యమైందే. ఇదికూడా యగ్గన్నడగాలి.

శ్రీమన్—దానికేం, వాడిజాతకంలో ఖూనీచేస్తాడని వీడి జాతకంలో ఖూనీ చెయ్యబడతాడనీ వుంది ; ఇదంతా విధికృతమంటాడు.

మోహ—మానవుడు స్వతంత్రుడు కాడన్నమాట జాతక రీత్యా చూస్తే.

శర్మ—యముడు ఆత్మను బాధపెడతాడు. కాని ఖూనీచేసిన వాడు భౌతికశరీరాన్ని నాశనం చేస్తాడు.

శ్రీమన్—యముడు బాధించేది ఆత్మనైతే రాజదండనకు యమదండనకు సంబంధ మెక్కడుంది ? రాజదండన వల్ల యీ భౌతిక శరీరానికే బాధ కల్గుతుంది.

శర్మ—ఆలెఖ్కలో ఖూనీవల్ల రాజదండనవల్ల యీ భౌతిక శరీరానికే బాధ కలుగుతోంది. అప్పుడీ రెండుశిక్షలకు తేడా యేముంది ?

శ్రీమన్—అందువల్ల ఇక్కడ చేసిన పాపాలకు రాజదండనే సరియైన శిక్ష అని వప్పుకోవాలి.

మోహన్—ఆ రెండు శిక్షలేగాదు, యమదండనకూడ అటువంటిదే.

సుంద—అది యెందువల్ల ?

మోహన్—యముడుకూడ భౌతికశరీరాన్నే కాని ఆత్మను బాధించ లేడు. అందువల్లే మార్కండేయుడు లింగాన్ని కౌగలించుకుంటే, యముడు తీసుకు వెళ్ళలేకపోయేడు. వాడికి కావలసింది ఆత్మైతే లింగాన్ని కౌగలించు కున్నంత మాత్రంలో అడ్డేముంది?

శ్రీమన్—లింగాన్ని కౌగలించుకున్నంతలో శరీరాన్ని మాత్రం తీసుకుపోడానికి అడ్డేముంది?

మోహన్—లింగాన్ని కౌగలించుకుంటే అదియొక క్రొత్త జంతువువలె కనుపించియుండొచ్చు భయంకరంగా, ఆదెబ్బతో యముడు పరుగెట్టి యుండొచ్చు.

సుంద—అదికాదు, మార్కండేయుడు యముణ్ణిచూసియేడిస్తే ఇరుగు పొరుగువారు కత్తులు కర్రలు పట్టుకొస్తే యముడు పారిపోయి యుండొచ్చు.

శ్రీమన్—యముడు అతని యనుచరులు సామాన్యులనా నీ యభిప్రాయం?

సుంద—సామాన్యమనుష్యులుకారు. మనుష్యులనుతినే మనుష్యులు. పూర్వము మనుష్యుల్ని ఎత్తుకపోయి చంపుకు తినేవారట. బ్రతికినవాళ్లు దొరక్కపోతే శవాల్ని తినేవారట. అంచేతే హిందువులు చచ్చినవారిని కాల్చ

డం మొదలెట్టేరు. పిఠాపురం తాలూకా అడవిగా వున్న కాలంలో పాండవులవారిమెట్ట వారి నివాస మట.

శ్రీమన్—ఇది ఏగ్రంథంలో ఉంది ?

సుంద—రాక్షసులగ్రంథంలోనో ఏ కోయిభాషలోనో వుంది. అదిఅంతా ఎందుకు నీకు. నేను చెప్పేవాణ్ణి నీవు వినే వాడివి పెద్దకాపులకు మల్లే.

శ్రీమన్—నేను పెద్దకాపులకుమల్లే గంగిరెద్దును గాను. ఈ గ్రంథ మెక్కడున్నదో చెప్పు ? నీకు తెలియగా లేనిది నాకెందుకు తెలియదు ?

సుంద—తాటాకుగ్రంథాలు కూడా లేని రోజుల్లో జరిగిన సంగతి ఇది. ఇది ఒక గాథ పురాణగాథలకుమళ్ళే. భగవంతుడు రాక్షసుల్ని సరిగ్గా వుంచేడూ మాటి మాటికీ అవతారాలెత్తి, వాళ్లపుస్తకాల్ని వుంచ డానికి ?

శ్రీమన్—ఇది నీకల్పితం అనుకుంటా.

సుంద—అన్ని పురాణాలూ కల్పితాలైననాడు ఇదియూ కల్పనే. నీవు వినకపోతే నేనేంచేసేది ?

శ్రీమన్—నీవు అబద్ధమాడొచ్చా యగ్గన్నకుమల్లే.

రాధా—మన పురాణాల్లో అప్పుడప్పు డవుసరమువచ్చినప్పు డబద్ధ మాడొచ్చునని యుందిగా !

శర్మ—ఎవరు అబద్ధమాడినా అవుసరమైతేనే, మన యగ్గన్న కూడా అవసరం లేకపోతే నిత్యం సత్యమే పలుకు తాడు.

రాధా—అబద్ధం యొక్క అవుసరమా ?

సుంద—అవును.

రాధా—మానవునికి అబద్ధంయొక్క అవుసరం లేకుండా ఎప్పుడు పోతుంది ?

శ్రీమన్—స్వలాభాపేక్ష లేనినాడు.

రాధా—స్వలాభాపేక్ష లేనివా రెవరు ?

శ్రీమన్—సామ్యవాది. అతడు సమాజంయొక్క మంచే తన మంచిగా భావించి సమాజంకోసం పాటుపడతాడు.

మోహన్—ఆహా ! ఏమిచిత్రం ? బ్రహ్మసృష్టికర్తట, శ్రీమహా విష్ణువు పెంచి పోషిస్తాడట, శంకరుడు నాశనం చేస్తాడట, అతడు నాశనం చేయలేక విడిచిన ఆత్మను యముడు పీడిస్తాడట, కర్మ అన్న రాజ్యాన్ని త్రిమూ ర్తులు పంచుకున్నారు. వారు పరిపాలించగా ఫలిం చిన పాపఫలాన్ని యముడు పొందుతాడట; అట్టి పరి

స్థితుల్లో మానవుడికి మంచిగాని చెడ్డగాని చేయడానికి అవకాశం ఎక్కడది? ఇది అంతా పిచ్చి. ఏనాడే పరిస్థితుల్లో మానవుడు యమలోకాన్ని సృష్టించేడో ఆనాటినుండి యీ చలితప్రపంచంలో మానవుని యొక్క భావాలు, భావాల్తోపాటు నీతులు మారాయి. ఆ మార్పులే సాంఘికపరిణామానికి దోహదమిచ్చింది. కాని ప్రాచీనమానవుడి నీతిమీద ఆధారపడి యింత వరకు శిక్షిస్తూ వచ్చిన యముడు నవీనమానవుడ్ని ఎల్లా శిక్షింపగల్గుతాడు? అందులకు అనుకూలంగా వుండేటట్లు అతడు నూతననైతికబలాన్ని సంపాదించి అతని న్యాయస్థానంలో వున్న చట్టాల్లో మార్పులు చేసేడా? ఈనాడు మన సాంఘికజీవితంమీద ఆనాటి అజ్ఞానంతోనో, మితజ్ఞానంతోనో, యమలోకాన్ని సృష్టించిన ప్రాచీనమానవుని నీతికి కట్టుబడిలేదు. మంచి, చెడ్డ అను మాటలకు ఎల్లకాలం అర్థం ఒకటే యై వుండదు. దానికి తార్కాణం హిందూమతంలో మంచిదిగా ఎంచబడిన సహాగమనం ఇప్పుడు ఆసంఘం లోనే ఖండింపబడుతోంది.

శర్మ—దీనికి మానవుడు వుద్దేశపూర్వకంగా సమాజాన్ని కట్టుబాటుల్లో వుంచడానికి సృష్టించేడు. ఇలాంటి

భావాలు వానిపుట్టిలో అంకురించడానికికారణం వారి యొక్క పరిస్థితులే. కాని యీవేళ బ్రహ్మస్థానము Legislature విష్ణుమూర్తి స్థానం Judeciary శంకరుని స్థానము Executive ఆక్రమించేయి.

శ్రీమన్—అయితే యముడి స్థానం?

శర్మ—పోలీస్.

సుంద—పూర్వం రాజులు ప్రజల్లో యిట్టి పిచ్చినమ్మకాన్ని కలిగించి ప్రజలను అణకువలోపెట్టి ఎల్లప్పుడు వారి వంశంలోనివారినే తమ యిచ్ఛవచ్చినట్లు పరిపాలించడానికై పండితులను పోషించి వారిచేత యిట్టిరాతలను వ్రాయించుకునేవారు. సమాజం మంచికోరక స్వలాభాన్నే యెల్లప్పుడు కోరు యీరాజులు పండితులమీద పండితులు రాజులమీద ఆధారపడి ప్రజలను విద్యాహీనుల్ని చేసి యీస్థితికి తీసుకొచ్చేరు హిందూ సమాజాన్ని. లేకపోతే ఈరాజులు ఆనాడే రాజ్యభ్రష్టులు కాకపోయేరు?

శర్మ—అదేకాదు, ఈ అన్యాయపురాజులు ఆ అమాయకపు ప్రజల్లో, యుద్ధంలో తనసాటి అమాయకపు ప్రజలను చంపి తనప్రాణాన్ని కోలిపోతే వీరస్వర్గం చేకూరుతుం

దన్న మూఢనమ్మకం కలిగించి తమ స్వలాభంకోసం వారి నుపయోగించుకొనేవారు.

సత్తి—పాపపుణ్యా లున్నాయండీ?

శర్మ—ఏదైతే సమాజంయొక్క సుఖమును అభివృద్ధి చేస్తుందో అది మంచి; దానికి ప్రతికూలమైంది చెడ్డ. ఈ మంచిచెడ్డలనే పూర్వం పాపపుణ్యాలనేవారు.

శ్రీమన్—అది నిజం. భగవంతుడుకూడ సమాజంకోసం ఎన్నోసార్లు అవతరించి అష్టకష్టాలు పడ్డాడు.

సత్తి—అవతారాలు నిజమేనాండి?

శర్మ—భగవంతుడు పదిసార్లు లే అవతరించేడు. కాని నీవు ఎన్నిసార్లు జన్మలెత్తలేదోయి? పునర్జన్మ అంటే ఏమిటి అనుకున్నావు. ఈజన్మలో సత్తిరాజువై అవతరించావు. పూర్వజన్మలోన ఏవీర్రాజవో వై యుండవచ్చు. మరోజన్మలో కామరాజు వెందుకవకూడదు? పునర్జన్మ వున్నదని ఒప్పుకొన్నవాడు భగవంతుడు ఏపందోయై జన్మించేడంటే తప్పేముంది?

శ్రీమన్—పునర్జన్మ వున్నదని నీవు వప్పుకుంటావా?

శర్మ—భగవంతుడేకాదు. నేనుకూడ అవతారపురుషుణ్ణే అని వప్పుకున్నవాడు.

శ్రీమన్—తన్ను తాను తెలుసుకుంటే భగవంతునితో సమానుడే అన్నారు. ఈ తెల్సుకోవడమే అనుకుంటాను.

సుంద—ఆనాడు మనసాటి మానవుల నందరిని సమాన భావంతోనే చూస్తాం.

రాధా—అది భగవంతుని దృష్టిలో అంతా సమానమే అనుకున్నాడు.

శ్రీమన్—భగవంతుని దృష్టిలో అందరు సమానులే అనుకున్నవాడు తన్ను తాను తెలుసుకొన్నవాడే. అతడే భగవంతుడూ తాను ఒకటే అనగలడు.

శర్మ—ఆమాత్రం జ్ఞానముంటే మానవుడు తన సాటివారిని నీచంగా చూడ్డానికి అవకాశ మెక్కడుంది. ప్రపంచాన్ని సృష్టించిన భగవంతుడే మానవుని తనతో సమానంగా చూస్తూవుంటే యీనీచులు ఎంతమంది మానవులను అన్యాయంగా చూడ్డం లేదు.

సుంద—అట్లు భావించకపోతే అనుభవిస్తారు. రష్యాలో సామ్యవాదాన్ని నెలకొల్పితే భగవంతుడొద్దన్నాడూ? సమాజంకోసం మన మేమిచేస్తే కాదన్నాడు భగవంతుడు.

[భిక్షకులు ప్రవేశింతురు]

భిక్షు—బాబూ, కాళ్ళు లేనివాడిని భిక్షం పెట్టండి.

మోహన్—చూచేరా, మనదేశములో దారిద్ర్యం?

రాధా—ఆకుంటివాణ్ని మోస్తోన్నవా రిరువురు యెంత బలాఢ్యులో! వారు పనిచేసి వాణ్ని పోషించడంబదులు యెల్లా వాడిమీద ఆధారపడుతున్నారో, వాళ్ళు సోమరులు. ప్రభుత్వం, ముష్టియెత్తుకునేవాళ్ళను జైలులో పెడితే బాగుండును.

శ్రీమన్—ఈ సోమరులకు జైళ్లెందుకు? మన యగ్గన్నతో చెప్పి యమునివద్దకు పంపితే రోజుకొకనిమీద యెక్కు తాడు. వీళ్లందరినీ జైళ్ళలో మేపడం మాటలా?

రాధా—అంగవిహీనులు జీవించు టెల్లా?

సుంద—సత్రవులు లేవూ! అక్కడ వాళ్ళను పెట్టి వాళ్ళు చేయగల పనిని వాళ్ళచే చేయించాలి.

మోహన్—సత్రవులు గొప్పవారికోసం! నీవు సామ్యవాదాన్ని అప్పుడే నెలకొల్పినట్లే మాట్లాడుతున్నావు.

సుంద—సామ్యవాదం వచ్చిననాడు సత్రవులుంటాయనా నీ యభిప్రాయం?

భిక్షు—బాబూ !

మోహ—కాదు, నీవు పనిచేయమంటే చెబుతున్నాను. ఇది రష్యాకాదు. అక్కడ పనిచేస్తేనే గాని తిండివుండదు. ఇక్కడ పనిచేసినా తిండివుండదు.

సుంద—పనిచేసేవాళ్ళకు పని వుంటుందా ?

మోహ—మానవుని సహాయంలేనిదే యంత్రాలు పనిచేసే రోజుల్లో పనిమాత్రము యేలా దొరుకుతుంది? రాయగడ పంచదారమిల్లు సాలుకు ఐదుమాసాలే పని చేయడం. అదంతా యెందుకు హార్లిక్స్ ప్రచారం చూడలేదు, మానవుని సహాయం లేనిదే యంత్రమే అన్నిపనులూ చేస్తుంది.

భిక్షు—బాబూ !

సత్తి—దున్నపోతుల్లాగున్నారు. పని చేసుకోలేరూ ? పగలు అడుక్కుంటారు, రాత్రిళ్ళు దొంగతనానికి బైలుదేరుతారు.

రాధా—పనిలేకపోతే కడుపుమాడి ఏదైనా చేస్తారు.

మోహన్—అది చాలా తప్పు. దొంగతనం చేసి ఎంతకాలం తింటారు? ఈవేళ దొంగపనిచేస్తే రేపు జైల్లో

వుంటారు. అప్పుడు వాడి పెళ్ళాం పిల్లలగతి ఏమవు తుంది?. అదేకాక దొంగతనంవల్ల విప్లవోద్రేకం వస్తుంది. దానితో సామ్యవాదాన్ని తీసుకొచ్చేశక్తి, దానితో వారి భవిష్యత్తు నాశనం చేసుకుంటారు. దీనికి ఏవర్గచైతన్యమున్న కార్మికుడు ఒప్పుకుంటాడు.

శ్రీమన్ — ఐతే రష్యాలో దొంగతనం లేదా ?

మోహన్ — రష్యాలో సామ్యవాదప్రభుత్వం రాకముందు దొంగతనముంది. కమ్యూనిష్టు పక్షంగాని విప్లవ కారులుగాని అలాంటిపనిని చేయుట కంగీకరించలేదు. దానికి తార్కాణం సాంఘికవిప్లవం వచ్చినరోజులలో లెన్నిన్‌గ్రాడ్‌లోనున్న రాజభవనాల్లోవున్న వస్తువు లను పనివాండ్రు తీసుకుంటే వల్లకాదని ఆటంకపరి చేరు వర్గచైతన్యమున్న కార్మికులు. ఇప్పుడు రష్యాలో దొంగతనం లేదు. అది చేయడానికి కారణమే లేదు.

శ్రీమన్ — దొంగతనం చేయడానికి కారణం ఒక ఆర్థిక దుస్థితే అనా?

మోహన్ — కాదు విద్యావిహీనత, సంస్కృతిలేమి. అవి పొందలేకపోవుటకు ఆర్థికదుస్థితే కారణం.

భిక్షు—పదండిరా పోదాం (అర్థోక్తిలో) మీకుమల్లే మాకు భూములుంటే మేమూ మీలాగే వుందుం.

(నిష్క్రమింతురు.)

శర్మ—చేయుటకుపని, పనిజేసినా తిండిలేనినాడు సంస్కృతి యెట్లు చేకూరును ?

మోహన్—సామ్యవాదం వచ్చిననాడు పనిచేసిన ప్రతిమానవునకు తిండివుండి తీరుతుంది.

శ్రీమన్—మానవుడు ఒక తిండిమీదనే జీవిస్తాడనా నీ వుద్దేశం ?

మోహన్—కాదు ! తిండి లేకపోతే జీవించడని.

రాధా—తిండి వున్నంతలో సంస్కృతి యెల్లా లభిస్తుంది ?

మోహన్—సంస్కృతి చేకూరడానికి విరామమవసరం.

రాధా—పని చేసిననాడేగాని తిండి వుండనినాడు విరామ మెట్లొస్తుంది ?

మోహన్—ధనికవర్గంలో ధనికులు వారి స్వలాభంకొఱకు కొద్దిమంది సహాయంతో పనిచేసే యంత్రాల నుపయోగించుకొంటున్నారు. ఆ లబ్ధిని వారే పొందుతున్నారు. అదే సమాజంయొక్క ఆర్థికదుస్థితికి కార

౫౦. స్వంతఆస్తి లేనినాడు, అందరు పనిచేసిననాడు, అనగా కొద్దిమందితో యంత్రాలుచేసే పనిని అందరూ పంచుకొన్ననాడు దానివల్లవచ్చిన లబ్ధిని ప్రతి మానవుడు పొందుతాడు. ప్రతి మానవుడికి తిండి వుంటుంది. విద్య నభ్యసించడానికి వ్యవధి వుంటుంది. అదే సామ్యవాదంయొక్క ముఖ్యోద్దేశం.

సుంద—శర్మా! 6 గంటలు అయింది. సామర్లకోట వెళ్ళి కామ్రేడ్సుతో ప్రసంగించి రేపు చేయావలసిన కార్యక్రమాన్ని నిర్ణయించుకోవాలి.

శర్మ—సరే — — — (లేచెదరు.)

(లేచి గోడ్డువరకు మిత్రులను సాగనంపి శ్రీమన్నారాయణ సత్తిరాజుతో ఇల్లు చేరుకున్నాడు.)

సమాప్తం.

శ్రీపతిముద్రణాలయము, కాకినాడ—1943.